

యం. ఉమామహేశ్వరరావు

ఆ అమ్మాయి అంత అందంగా ఉంటుందని కలలో కూడా అనుకోలేదు సుబ్రమణ్యం. కనీసం ఎత్తూ, కనీసపు అందం, కనీసం రంగూ అయినా లేని తనంటే యిష్టపడిందంటే!

సుబ్రమణ్యం తలంతా దిమ్మెత్తిపోయిందారోజు. కూర్చున్న కుర్చీ గిర్రున తిరిగి పడిపోతానేమోననిపించింది. శరీరంలో కదలాడుతున్న సంగీతం శృతి మించిపోయి రాగాలాపన చేస్తూవుంటే నిలదొక్కుకోవడం కష్టమైపోయింది.

పాపం! సుబ్రమణ్యం!

బతికే బ్రతుకుల్లో ఏపేసమైనా ఆనందం, ఆరోగ్యంలేని, సన్నకారు, చిన్నకారు టెంపరరీ ఉద్యోగి. తెచ్చుకుంటున్న జీతంలోది సగం యింటి అద్దెకూ, మిగతాసగంలో సగం తిండికే, మిగతాది యింటిదగ్గరవున్న ముసలితల్లికే సరిపోతూంటే, పెళ్ళాం ఊసూ, ఆ తలపూ, ఆ ఆలోచనా అతడి గుండె గదిలోకెలా వస్తాయండీ పాపం?..........

అందుకే పాపం సుబ్రమణ్యం అనుకున్నారంతా. అందరితోపాటుగా నరశింహం కూడా అలానే అనుకున్నాడు.

నరశింహ సుబ్రమణ్యానికి యిల్లు అద్దెకిచ్చిన యింటి యజమాని. సుబ్రమణ్యం అంటే బొత్తిగా అమాయకుడని భావించే అతిమంచి మనిషి.

"బుద్ధిమంతుడు, వంచిన తలకాయ ఎత్తడు. దిక్కులు చూడడు. అప్పుడప్పుడు ఆ 'దిక్కుల్లో' దాగునే చక్కని చుక్కలవేపు కళ్ళెత్తయినా చూడడు... మీ అమ్మాయికి యింతకంటే బుద్ధిమంతుడైన వరుడు మరి లభించడు..."

అంటూ ఓ రోజు ఆంజనేయుల్ని వాయించేసేడు. ఆంజనేయులు ఓ ఆడపిల్ల తండ్రి. అందగత్తె, బుద్ధిమంతురాలూ అయిన తన కూతురుకు డిటో క్వాలిఫికేషనుతో నాలుగురాళ్ళు సంపాదించే వరుడికోసం ఎన్నాళ్ళనుంచో వెదుకుతున్న ఓ తండ్రి.

ఆంజనేయులు కూతురు పేరు సుభాషిణి.

పదో తరగతి పాసైనాక, యిక చదవనని తెగేసి, తండ్రితోచెప్పి, యింటి దగ్గరే వుంటుంది. వంటలు బ్రహ్మాండం. బట్టలుతకడంలో ఫస్టు. పాటలు పాడటంలో సూపర్బ్. అందంలో అప్సరస. మగాడన్నవాడికి యివన్నీ అవసరమే. అయితే పెళ్ళాంగా చేసుకోవాలనుకునే వాడికి మాత్రం వీటన్నింటితోపాటుగా యింకా కొన్ని వుండాలి.

అయినా యివి చాలనుకున్నాడు నరశింహం. బాల్య వివాహాలూ, 'సతు'లూ లాంటి అనాగరికత భరితమైన సమాజంలో ఎదిగొచ్చిన కూతురుకు ఉద్యోగంచేసే బుద్ధిమంతుడయిన మొగుడు

లభించడం ఒకవైతే, కుర్రాడి సెలక్షన్లో అతనింటి యజమానే వకాల్తా పుచ్చుకోవడంతో ఆంజనేయులు మహా సంతోషపడిపోయేడు.

ఆ రాత్రి ఈ వార్త సుబ్రమణ్యానికి చేరింది.

మొదట్లో ఉలిక్కిపడ్డాడు సుబ్రమణ్యం.

"అబ్బెబ్బే... నాకెందుకండీ పెళ్ళి?" అన్నాడు అమాయకంగా ముఖాన్ని పెట్టి.

"పెళ్ళి నీక్కాకపోతే...నాకటయ్యా బాబూ?" అన్నాడు నరశింహం.

సుబ్రమణ్యం తలదించుకున్నాడు సిగ్గుతోగాదు, చిరాకుతో.

"అమ్మాయి అప్సరస అని నేను అనను. కాని ఫరవాలేదు... కట్నం నువ్వడిగినంత అని కూడా నేను చెప్పడంలేదు... అయినా ఎంతో కొంత యిస్తారు. మరీ లేనివాళ్ళేమీగాదు లేవయ్యా... ఇకపోతే నువ్వోసారి వచ్చి అమ్మాయిని చూడు. అప్పుడప్పుడు కథలూ, కాకరకాయలూ రాస్తావుగదా!! ఆ మాత్రం తెలుసుకోలేవా నువ్వు?"

ఇక మాట్లాడక తప్పలేదు సుబ్రమణ్యానికి.

"పోన్లెండి... ఇవాళే మా అమ్మకో కార్డుముక్క రాసిపడేస్తాను. తనూ వస్తుంది అమ్మాయిని చూడడానికి..." నెమ్మదిగా అన్నాడు.

భళ్ళున నవ్వేడు నరశింహం.

పిచ్చోడిలాగ ఉలికులికిపడుతూ మరీ నవ్వేడు.

"అందుకే నీకోసం నేను శ్రమపడుతుంట! నువ్వేంటో నాకు బాగా తెలుసును కాబట్టే ఈ ప్రయత్నం అంతాను" అంటూ సుబ్రమణ్యాన్ని మరీ నోరెత్తనీలేదు.

* * * * *

"ఏవోయ్ సుబ్రమణ్యం! అమ్మాయి నచ్చిందా?"

ఆ అమ్మాయిని చూసి వచ్చేక వెంటనే అడిగేడు నరశింహం. పాములా మెలికలు తిరిగిపోయేడు సుబ్రమణ్యం.

చిరుజల్లుకు కదలాడే ఆకులాగ కదిలిపోయేడు. ఆ అమ్మాయి గుర్తుకొచ్చింది.

చంపకు చారడేసి కళ్ళు... మీనాల్లాగా కదలాడే కళ్ళు. స్పృశించగానే ముడుచుకుపోయే టచ్ మీనాట్ మొక్క ఆకులాంటి ఒళ్ళు... సన్నంగా, అందంగా... అజంతా శిల్పంలా, 'బాపు' బొమ్మలా క్రిష్ణశాస్త్రి కన్నియలాగ ఉందా అమ్మాయి. పాటలొచ్చు. పాడగలదు. ఇంటి పనులన్నీ వచ్చు. ఇంకేం దర్జాగా పెళ్ళి చేసుకోవచ్చు. అందం సూపర్బ్ అని మొదటేగా చెప్పుకున్నదీ..." అనుకున్నాడు మనస్సులో.

"ఇక నిద్రపోవయ్యా హాయిగా. ఉదయాన్నే డ్యూటీకి వెళ్ళాలి కదా!! తరువాత తతంగం నేన్జూసుకుంటాలే.' అనేసి తనింట్లోకి వెళ్ళిపోయేడు నరశింహ సుబ్రమణ్యాన్ని అలాగే ఆ స్థితిలోనే వదిలేసి.

పాపం సుబ్రమణ్యానికి నిద్రెలా వస్తుందీ?

కళ్ళు తెరచినా, కళ్ళు మూసినా ఆ అమ్మాయే కనిపించసాగింది. చక్కటిపేరు సుభాషిణి. తెల్లవార్లూ కలలో ఆ సుభాషిణితో కలిసి సుబ్రమణ్యం పాడుకున్న పాటలూ, ఆడిన ఆటలూ, యిక్కడ ప్రత్యేకంగా వ్రాయనక్కర్లేదు

* * * * *

ఆ రోజు మొట్టమొదటిసారిగా మన పోస్టల్ డిపార్ట్‌మెంటు వారిమీద కోపం వచ్చింది సుబ్రమణ్యానికి. చేతిలోవున్న పోస్టు కార్డు చదివి కూడా ఎదురుగా వున్న పోస్టుమేన్‌ను తిట్టడం భావ్యంకాదని ఆగిపోయేడు. పైపులోంచి నీళ్ళు వచ్చినట్లుగా కళ్ళమ్మటనుంచి నీళ్ళు వచ్చేయడంతో దిక్కుతోచని సన్యాసిలాగ అయిపోయేడు సుబ్రమణ్యం.

అసలింతకీ ఆ కార్డులో ఏవుందంటే, సుబ్రమణ్యం అమ్మకు విపరీతమైన జబ్బుచేసిందట... అర్జంట్‌గా ఆవిడగారు తన కొడుకును కళ్ళారా చూసుకోవాలనుకుంటున్నదనీనూ... ఆపైన వెంటనే మారాలస్యం చేయకుండా బయల్దేరి రమ్మనీ ఉంది.

మరింకాలస్యం చేయలేదు సుబ్రమణ్యం. చేతి సంచిలో ఓ రెండు జతల గుడ్డలు కుక్కుకుని ఆర్టీసీవారు బస్టాండుకు చేరిపోయి తన వూరు వెళ్తున్న బస్‌నెక్కేసేడు.

తన యింటి ముందు వాకిట్లో నించుని అసలది తన ఇల్లేనా అని చూస్తున్నాడు సుబ్రమణ్యం. అక్కడ, ఆ వాకిట్లో, మరో యిద్దరు ఆడపిల్లల్తో ఆడుతున్న పరికిణీ...ఓణీ కన్నెపిల్లను చూసీ చూడ్డంతోనే తనిల్లు కాదేమోనన్న శంక కలిగింది.

లోపల్నుంచీ, బయటికొచ్చిన ఓ పంచా,లాల్చీ శాల్తీ సుబ్రమణ్యాన్ని వెంటనే గుర్తు పట్టేసింది.

"రారా! బడుద్ధాయి. ఎంతసేపయిందివచ్చి?" అంటూ సుబ్రమణ్యం రెక్క పట్టుకుని అతను వివరించే సవినయ సమాధానాన్ని వినకుండా లోపలకు లాక్కెళ్ళిందా శాల్తీ.

సదరు శాల్తీపేరు సుబ్బారాయుడు. మన సుబ్రమణ్యానికి మేనమావ కూడాను.

ఆ లోపలగదిలో మంచంమీద సుబ్రమణ్యం ముసలితల్లి పడుకునే ఉంది. పలకరింపుల ఘట్టం పూర్తయింది. పరామర్శల సువిశాల ఆత్మీయతలు పూర్తయ్యాయి.

"అసలు కథేటీ?... నన్ను అర్జంటుగా పిలవడంలో విషయం ఏమిటి?" సీరియస్‌గానే కళ్ళు చిట్లించి కనుబొమ్మల్ని ముడిచి ప్రశ్నించాడు సుబ్రమణ్యం. సరిగా అప్పుడే సుబ్రమణ్యం పక్కకేవచ్చి నించున్న యిందాకటి పరికిణీ... ఓణీ... శాల్తీనిచూసి, సుబ్రమణ్యం ముసలితల్లి కళ్ళల్లోంచి ముత్యాల జల్లు టపటపారాలింది.

"ఇదిగో సుబ్బులూ... యిందుకే పిల్చింది నిన్ను. వాడు నా తమ్ముడు. ఇది వాడికూతురు. పేరు సుబ్బలక్ష్మి. నీకు మేనకోడలు. దీన్ని నువ్వు పెళ్ళి చేసుకుంటే అది నీకు పెళ్ళాం అవుతుంది. ఆ వెనక దానితోపాటుగా లక్షరూపాయలు ఖరీదుచేసే యిల్లూ, రెండెకరాల మాగాణీ పొలం వగైరాలు నీకు చెందుతాయి. ఎన్నాళ్ళు కష్టపడితే లక్షరూపాయలు సంపాదించగలవు? ఎన్ని అవసరాలు మానుకుని మిగలేస్తే రెండెకరాలు భూమిని కొనగలవు?... మరంచేత నిన్ననే మనూరు పంతులుగార్ని కబురుపెట్టి ముహూర్తం నిర్ణయించేసేం. వచ్చేనెలలోనే నీకూ... దానికీ పెళ్ళి. అంతేనాయనా... అంతే!!

అందా ముసలితల్లి. తల్లి అలా ఇదంతా చెప్తున్నంతసేపూ ఏమీ అన్లేకపోయేడు సుబ్రమణ్యం. మావయ్యకేసి చూసేడు. ఆనక ఆ 'పిల్ల' వంక చూసేడు.

ముఖం అమాయకంగా వుంది. లేతగా వున్నచెంపలు. పరిపక్వతకింకా రాని శరీరం.

సుబ్రమణ్యం ఆలోచనలు మరో ప్రక్కకు బలహీనంగా కదుల్తున్నాయా సమయంలో. అందంగావుండే అప్సరసలాంటి సుభాషిణి గుర్తొచ్చింది. చెంపకు చేరెడేసివుండే ఆ కళ్ళు, మాధుర్యమైన ఆ కంఠం ఉద్యోగస్తుడి పెళ్ళాం హోదాకు సరిపోయే ఫిగర్.,............. కాని,... సుబ్రమణ్యంలోని 'నరుడు' సరిగ్గా అప్పుడే మేల్కొన్నాడు. ఆలోచన్లదారిలో సుబ్రమణ్యాన్ని లాక్కెళుతూ నవ్వసాగేడు. యుద్ధం జరుగుతోంది సుబ్బారావుకీ... ఆ నరుడికీ మధ్య...

సుభాషిణియా?!... సుబ్బలక్ష్మా?!"

సుభాషిణి వెనక ఆస్తి... నిల్... ఓ మోస్తరు తృప్తి. సుబ్బలక్ష్మి ప్లస్ లక్షరూపాయల ఇల్లు ప్లస్ రెండెకరాల మాగాణీ...

పాపం చాలాసేపటి వరకూ ఎటూ నిర్ణయించుకోలేక సతమతమైపోతూ, ఎలాగయితేనేం చివరకు...

సుబ్రమణ్యం ఆ అందమైన సుభాషిణిని పెళ్ళి చేసుకొన్నాడా?... లేక ఆస్తి పాస్తులున్న సుబ్బలక్ష్మి మెడలో మూడు ముళ్ళూ వేసేడా అన్నది నేను వ్రాయనక్కర్లేదనుకుంటాను...

ఎందుకంటే, భూమి గుండ్రంగానే వుందన్న సంగతి మీకు తెలీదు కనకనా?!!...

*